ప్రజాశక్తి
శనివారం 30 డిసెంబర్ 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సిట్టింగ్‌లకు సీట్ల భయం

- కొత్తవాళ్ల కోసం వైసిపి అన్వేషణ
- గెలిస్తే గౌరవం దక్కుతుందని బుజ్జగింపు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గ సీట్లను కొత్త వారికి ఇవ్వాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచనతో సిట్టింగ్‌లకు ముచ్చెమటలు పడుతున్నాయి. సిట్టింగ్ స్థానం కోల్పోకుండా చేస్తున్న కసరత్తులో కొన్ని చోట్ల కొత్త ముఖాలు రానున్నాయి. ఏయే సీట్లలో కొత్తవారిని పెట్టాలనుకుంటున్నదీ ఇప్పటికే సూచనప్రాయంగా ఆయా ఎమ్మెల్యేలకు తెలియజేసినట్లు తెలిసింది. తమ పదవీకాలంలో చేసిన సేవలను వివరించి ఈసారికి మరో అవకాశమివ్వాలని కోరినా అందుకు జగన్ అంగీకరించలేదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకసారి సిఎం నిర్ణయం తీసుకున్నాక అందులో మార్పు వుండదని తెలిసిన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ ఇబ్బందులను చెప్పడానికి కూడా వెనుకాడుతున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో కొత్తవారి విజయానికి మనస్ఫూర్తిగా కృషిచేసిన సిట్టింగ్‌లకు మంచి గౌరవం దక్కుతుందని భరోసా ఇచ్చినా, సీటు వదులుకోవడానికి ఎవరూ సుముఖంగాలేరు. పార్టీ అధికారంలోకి రాకపోతే తమ పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు వారి నుంచి వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో కొత్త వారిని పెడతామని కొద్ది రోజుల క్రితం పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావుకు పార్టీ నాయకులు తెలిపారు. కొంతకాలంగా నియోజకవర్గంలో పార్టీ నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు రోజురోజుకూ పెరగడంతో బాబూరావును మార్చాలన్న యోచనలో పార్టీ నాయకత్వం వుంది. ఆయనకు టిక్కెట్ ఇచ్చినా నియోజకవర్గ నాయకులు పనిచేసే అవకాశం లేకపోవడంతో కొత్త వారిని పెట్టడానికి వైసిపి అధిష్టానం సిద్ధపడింది. దీంతో ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ అమ్మాజీ, గత ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీచేసి ఓటమిపాలైన డాక్టర్ బంగారయ్య సహా పలువురు పాయకరావుపేట సీటు దక్కించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. బాబూరావుకు రాజ్యసభ సీటు ఇస్తారని ప్రచారం జరుగుతున్నా అందుకు సిఎం సానుకూలంగా లేరని తెలుస్తోంది. ఎన్నికల వరకూ ఆయన సేవలను పార్టీ ఉపయోగించుకోవాలని చేస్తున్న ఎత్తుగడ తప్ప రాజ్యసభ సీటు ఇవ్వడానికి కాదన్న వాదన ఆ పార్టీ వర్గాల నుంచి వినిపిస్తోంది.

పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజుకు, అనకాపల్లి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌కు, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వచ్చేసారి సీటు దక్కే అవకాశం లేదన్న ప్రచారం సాగుతోంది. యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు పట్ల సిఎం అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. తన తనయుడు వర్మకు టిక్కెట్ ఇవ్వాలని ఆయన కోరుతున్నా అందుకు ససేమిరా అన్నట్లు సమాచారం. తప్పనిసరి మిగతా 2లో..

వార్త 8లో..



ఉక్కు రక్షణ గీతానికి డ్యాన్స్ చేస్తున్న పల్సర్ బైకు ఝాన్సీ బృందం

ఉత్సాహంగా ఉక్కు ధూంధాం

నేడు 'ప్రపంచీకరణ- ఉపాధి'పై జాతీయ సెమినార్

- హాజరుకానున్న ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయిక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన నండూరు ప్రసాదరావు స్మారకోపన్యాసంలో భాగంగా 'ప్రపంచీకరణ-ఉపాధి' అన్న అంశంపై శనివారం ఉదయం 10 గంటలకు విశాఖ డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఈ సెమినార్‌కు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ ప్రొఫెసర్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయిక్ ముఖ్య వక్తగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆయనతో పాటు సిఐటియు అఖిలభారత కార్యదర్శి, మిగతా 2లో..

ప్రజా ఉద్యమాల ఫలం.. కాకూడదు ప్రైవేట్‌పరం

విశాఖ ఉక్కును బలహీన పరిచే కేంద్ర చర్యలపై స్వతంత్ర దర్యాప్తు జరగాలి

-మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజా ఉద్యమాల ఫలితంగా 1971లో విశాఖ ఉక్కు ప్రారంభమైందని, కేంద్ర ప్రభుత్వం నేడు ఎన్నో విధాలుగా బలహీనపరిచి ఒక ప్రైవేట్ సంస్థకు తక్కువ ధరకు అమ్మే దిశగా చేపట్టిన వ్యూహాలపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'కర్మాగారానికి కావాల్సిన సుమారు 20 వేల ఎకరాలను అప్పటి భూ సేకరణ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమకు రైతుల నుంచి తీసుకుని ఇచ్చింది. అటువంటి పరిశ్రమను ప్రయివేట్ సంస్థకు ఇవ్వడం చట్టవిరుద్ధమే అవుతుంది. భూములు నాడు కోల్పోయిన రైతులకు ద్రోహం చేయడమే ఇది. చట్టాన్ని గౌరవించకుండా కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టాలనుకోవడం సమర్థనీయం కాదు. ఉక్కుకు సొంత గనులను కేటాయించకపోవడం దారుణం. కేంద్రం ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తోంది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉక్కు కర్మాగారాల్లో సొంత ఇనుప గని లేనిది ఒక్క విశాఖ ఉక్కే. ఎన్ని విజ్ఞప్తులు చేసినా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ సంస్థలకు విచ్చలవిడిగా ఇనుప గనులను కేంద్ర ఖనిజ మంత్రిత్వ శాఖ ఇచ్చేస్తోంది. విశాఖ ఉక్కు అమ్మకంలో ప్రైవేట్ సంస్థలు కాకుండా సెయిల్ పాల్గొంటే విశాఖ ఉక్కుకు నిజమైన విలువ వచ్చేది. కారుచౌకగా ఉక్కును కొన్ని సంస్థలకు ఇచ్చేసే కుట్రను కేంద్ర ప్రభుత్వం చేయడం సరైనది కాదు.

ప్రజాప్రతినిధులు పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీల్లో పార్టీలకు అతీతంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్న డిమాండ్ చేయాల్సి ఉంది. లేదంటే ఈ రాజకీయ నాయకులకు ప్రజా క్షేత్రంలో భవిష్యత్ ఉండదని హెచ్చరిస్తున్నాను' అని తెలిపారు.

మౌలిక వసతులు, అభివృద్ధే లక్ష్యం

జివిఎంసి మేయర్, కమిషనర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'జివిఎంసి పరిధిలో సమ్మె చేపట్టిన కార్మికుల డిమాండ్లు చాలా విలువైనవి, అందరం గౌరవించాల్సినవి, వీటి పరిష్కారానికి తగిన కృషిని చేస్తున్నాను, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసే ప్రయత్నాలు చేస్తున్నాం' అని జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయం అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం జివిఎంసిలో ఏర్పాటు చేసిన 2023కి వీడ్కోలు, 2024కు స్వాగతం కార్యక్రమంలో వారిరువురూ మాట్లాడారు. తొలుత కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ నగరంలోని 97 వార్డుల కార్పొరేటర్లతో కలిసి విశాఖ నగర అభివృద్ధికి పనిచేస్తామన్నారు. 2023లో సాధించిన ప్రగతిని, లక్ష్యాలను మననం చేసుకుంటూ లోపాలను సవరించుకుని 2024లో మరింత నూతనోత్సాహంతో విశాఖ నగర సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 2023-24 సంవత్సరంలో రూ.205 కోట్ల 5 లక్షల రూపాయల అంచనాలతో 967 పనులు చేపట్టగా 332 పనులను రూ.70 కోట్ల 4 లక్షలతో పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. వార్డుల అభివృద్ధి ప్రణాళికలో 98 వార్డులకుగాను 938 పనులను రూ.148.11 కోట్ల అంచనాలతో చేపట్టగా 577 పనులు పూర్తయ్యా యన్నారు. నాడు - నేడు స్కూల్స్ అభివృద్ధిలో తొలి దశ 59 పాఠశాలలను రూ.20 కోట్ల 77 లక్షలతో పూర్తి చేయగా, రెండో దశలో 87 పాఠశాలలకు రూ.34.79 కోట్లు ప్రతిపాదనలు చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పార్కుల అభివృద్ధి, వీధి దీపాలు, అమృత్ పథకం, భూగర్భ మురుగునీటి పారుదల, ప్రజారోగ్యం, ఎకో వైజాగ్ అభివృద్ధి, యుసిడి, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, జగనన్న కాలనీలు, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా, పట్టణ ప్రణాళికా విభాగం, ఆర్థిక విభాగం, విద్య, జగనన్న విద్యా కానుక, క్రీడలు విభాగం, ఆడుదాం, ఆంధ్రా వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించా మన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ విధులకు ఆటంకపరిస్తే చర్యలు

ప్రజాశక్తి - విశాఖపట్నం

మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని, ఎవరైనా ఆటంకపరిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 'క్లాప్ డ్రైవర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు శనివారం ఉదయం 5.30కి విధుల్లో ఉండాలి. పనులకు రాని వారికి నో వర్క్ నో పే అమలు చేస్తాం. పారిశుధ్య పనులను సచివాలయ సిబ్బంది చూడాలి. పనులను ఎవరైనా అడ్డుకుంటే చర్యలు తీసుకోవాలి' అని ఉత్తర్వులు జారీ చేశారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శుక్రవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు.

మద్యంపై ధర్నా

ప్రజాశక్తి-సీతమ్మధార : మద్యాన్ని నియంత్రిస్తామన్న ఎన్నికల వాగ్దానాన్ని తుంగలో తొక్కిన జగన్మోహన్‌రెడ్డి విధానాలను నిరసిస్తూ శుక్రవారం హెచ్.బి కాలనీలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.

ఇండియన్ బ్యాంక్ మెగా ఎస్‌హెచ్‌జి శిబిరం



చెక్కుతో బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యాన డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం మెగా ఎస్‌హెచ్‌జి (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్), క్రెడిట్ అవుట్ రీచ్ శిబిరం నిర్వహించారు. ఈ ప్రచార శిబిరాన్ని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్ కుమార్ బజాజ్, ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎ.గణేషరామన్, జోనల్ మేనేజర్ వెంకటరమణరావు, ఇండియన్ బ్యాంక్ స్థానిక శాఖల మేనేజర్లు సమక్షంలో చేపట్టారు. 250 ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ బజాజ్ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలోని ఇండియన్ బ్యాంక్ వ్యాపార కార్యకలాపాలను వివరించారు. ఎస్‌హెచ్‌జిలకు తాము అందిస్తున్న సహకారాన్ని తెలియజేశారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజీ కార్యక్రమానికిగాను ఉత్తమ పనితీరు కనపరచినందుకు భారత ప్రభుత్వం నుంచి అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 8070 స్వయం సహాయక గ్రూపుల లబ్దిదారులకు ఈ డిసెంబర్ త్రైమాసికంలో సుమారు రూ.1200 కోట్లు ఇండియన్ బ్యాంక్ మంజూరు చేసినట్లు తెలిపారు.

6న సామాజిక సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వచ్చే నెల 6వ తేదీన నిర్వహించనున్న సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనుక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలి, కెవిఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

సిట్టింగ్‌లకు సీట్ల భయం

పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో రమణమూర్తిరాజుకు టిక్కెట్ ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు టిక్కెట్ ఇచ్చే విషయంలో కూడా ఆలోచిస్తున్నట్లు సమాచారం. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడుకు ధీటైన వ్యక్తిని పోటీలో వుంచాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మాడుగుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు వరకు టిక్కెట్ విషయంలో గ్యారంటీవున్నా, మిగిలిన నియోజకవర్గాల్లో ఆచితూచి సీట్లు కేటాయించాలని చూస్తోంది.

నేడు 'ప్రపంచీకరణ- ఉపాధి'పై జాతీయ సెమినార్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సెమినార్‌లో వివిధ ప్రభుత్వరంగ పరిశ్రమల్లో పనిచేస్తున్న 700 మంది కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో 55 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : 52 మెయిన్ అజెండాలతో పాటు టేబుల్ అజెండాలు 3 మొత్తంగా 55 అంశాలను శుక్రవారం ఉదయం జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా సభ్యులంతా ఆమోదించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.256 కోట్లు అభివృద్ధి పనులకు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి, అదనపు కార్మికులను తాత్కాలికంగా సేవలు వినియోగించుకునేందుకు రూ.142.72 కోట్లు బడ్జెట్ ఆమోదించారు. అలాగే రెవెన్యూ విభాగానికి సంబంధించి లీజులు పొడిగింపు మొదలైన అంశాలతో కలిపి 55 అంశాలను ఆమోదించారు. జోన్ల వారీగా లీజుల వివరాలను స్టాండింగ్ కమిటీలో సభ్యులకు వారి వారి వార్డులు, జోన్ల వారీగా అధికారులు సమర్పించాలని కార్పొరేటర్ ఉరుకూటి నారాయణ రావు సమావేశంలో కోరారు. దీనికి రెవెన్యూ విభాగపు అధికారి ఫణిరాం జోన్ల వారీగా లీజుల వివరాలను అందజేస్తానన్నారు.

పాములు పట్టే వారి నియామకం చేయాలి

సిఎంఒ నరేష్‌కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోగల 8 జోన్ల పరిధి, శివార్లలో పాముల బెడద ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పాములు పట్టేవారిని నియమించుకోవాలని స్థాయీ సంఘ సమావేశంలో ప్రతిపాదన పెట్టారు. రొక్కం కిరణ్‌కుమార్ ఈ స్నేక్ సేవర్ సొసైటీ విశాఖపట్నంకు అధ్యక్షులుగా ఉన్నారని, ఎలాంటి వేతనం తీసుకోకుండా ఆయన పనిచేస్తున్నారని వివరించారు. ఆయన శిక్షణ ఇచ్చిన పది మందిని నియమించుకుంటే ఒక్కొక్కరికీ నెలకి రూ.10 వేలు చొప్పున వేతనం చెల్లించాలని ప్రతిపాదిస్తున్నానని, 2024 జనవరి 1 నుంచి 2024 జూన్ 30 వరకూ మొత్తంగా ప్రతి నెలా రూ.4.80 లక్షలు రొక్కం కిరణ్‌కుమార్ టీంకు చెల్లించేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్ కుమార్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

విశాఖ నగరంలో నేరాలు తగ్గుముఖం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గతంలో పోల్చుకుంటే విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు తీవ్రత తగ్గుముఖం పట్టిందని, శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్షిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022లో 4494 కేసులు నమోదుకాగా ఈ ఏడాది 3513 కేసులు మాత్రమే నమోదైనట్లు వెల్లడించారు. నేరాల తీవ్రతలో 27.92 శాతం తగ్గుదల నమోదైందన్నారు. 2023లో 27 హత్య కేసులు నమోదవగా, వీటిలో అధికంగా క్షణికావేశంతోనూ, వివాహేతర సంబంధాల కారణంగానూ నమోదయ్యాయన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి ఈ ఏడాది 224 కేసులు నమోదయ్యాయని, 886 మంది నిందితులను గుర్తించి 660 మందిని అరెస్టు చేశామన్నారు. 4628 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కోర్టు ఇన్ గేటు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం 11వ రోజైన శుక్రవారమూ కొనసాగింది. విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ భూహక్కు చట్టం అమలులోకి వస్తే భూమికి సంబంధించిన వివాదాల్లో న్యాయస్థానాల ప్రమేయం ఉండదన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం కనుక ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు.

డ్వాక్రా బజార్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శుక్రవారం బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో డ్వాక్రా బజారును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు డ్వాక్రా మహిళలకు రుణాలను మంజూరు చేశారని, తద్వారా వారు వ్యాపారాలు చేస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్నారని తెలిపారు.

'ఉత్తరం'లో టిడిపి సమస్యలపై చర్చ

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో టిడిపి నాయకుల సమస్యలపై శుక్రవారం 26వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్ కుమార్ అధ్యక్షతన పార్టీ నియోజకవర్గం నాయకులు సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. పదేళ్లుగా నియోజకవర్గంలో టిడిపి నాయకులు పడుతున్న ఇబ్బందులను ఏకరవుపెట్టారు.

పంచ గ్రామాల సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-సింహాచలం: 24 సంవత్సరాల నుంచి సాగుతున్న పంచ గ్రామాల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సింహాచలం ప్రధాన కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రాస్తారకో జరిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ, ఈ సమస్య పరిష్కారానికి కేబినెట్లో ఆమోదం తెలిపి, గత ప్రభుత్వం మాదిరిగా ఆదరాబాదరాగా జిఒను తెచ్చి తర్వాత సమస్యను పక్కదారి పట్టించారని విమర్శించారు. ఈ సమస్య వల్ల సుమారు లక్ష మంది జనాభా బాధపడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించుకుంటే రానున్న ఎన్నికల్లో బాధితులు తరపున ఒక అభ్యర్థిని పోటీలో నిలుపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జివిఎంసి 72వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, ఈ సమస్యపై జివిఎంసి కౌన్సిల్లో తీర్మానం ప్రవేశపెడితే మేయర్ దీన్ని తిరస్కరించడం శోచనీయమన్నారు. దీన్ని చూస్తే ప్రభుత్వ పెద్దలు ఏ విధంగా మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. వెంటనే రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టీవీ.కృష్ణంరాజు, సిహెచ్ఎస్ గోపాలకృష్ణ, ఎబిఎన్.ప్రతాప్, సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకటరావు, సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం సభ్యులు పి.రామారావు, సిహెచ్ కోటేశ్వరరావు, ఎస్వి.రమణ, ఎం.రామభద్రరావు, నాగేశ్వరరావు, వి.నారాయణరావు, కృష్ణారావు, బి.శంకరరావు, శ్రీనివాసరావు, శ్రీహరి, కాలనీ సంఘాల పెద్దలు, బాధితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గంగారావు, శిబిరంలో ఎంవిఎస్.శర్మ తదితరులు

బిఆర్టిఎస్ బాధితులకు టిడిఆర్ చెక్కులు అందజేయాలి

ప్రజాశక్తి-సింహాచలం: అడవివరం నుంచి సింహాచలం వరకు బిఆర్టిఎస్ రోడ్డు విస్తరణ పనుల పేరుతో రోడ్డుకిరువైపులా ఇళ్లను కోల్పోతున్న బాధితులకు టిడిఆర్ చెక్కులను అందజేయాలని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బి.వెంకటరావు డిమాండ్చేశారు. విస్తరణలో నష్టపోయిన వారికి ఇంతవరకు ఎటువంటి పరిహారమూ చెల్లించకుండా కాలయాపన చేయడాన్ని ఖండించారు. బిఆర్టిఎస్ బాధితులకు వారం రోజుల్లోనే టిడిఆర్ నష్టపరిహారాలు చెల్లిస్తామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు టిడిఆర్ చెక్కులు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. బాధితులకు వెంటనే టిడిఆర్ చెక్కులు ఇవ్వకపోతే సిపిఎం పోరాటానికి దిగుతుందని హెచ్చరించారు.



నియామకపత్రం అందిస్తున్న ముత్తంశెట్టి

అవంతిలో ముగిసిన జాబ్ మేళా

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో గురువారం ప్రారంభమైన మెగా జాబ్ మేళా శుక్ర వారం ముగిసింది. టెక్ మహేంద్ర, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ లెబొరేటరీస్, మిరాకిల్ సాఫ్ట్వేర్, కోరమాండల్ పెయింట్స్, కోగెంట్, లక్ష్మి హుండై, సినర్జీస్ కాస్టింగ్స్ తదితర 35 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఇంజనీరింగ్, ఫార్మసీ జూనియర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు సుమారు 2 వేల మంది జాబ్ మేళాకు రాగా, ఆయా కంపెనీల ప్రతినిధులు లిఖిత, మౌఖిక పరీక్షలు, బృంద చర్చలు ద్వారా 435 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఏ రంగంలోనైనా నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వాటంతట అవే వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందించారు. ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి రమేష్ నాయుడు, ఎన్ఎస్టిఎల్ శాస్త్రవేత్త ఆర్ శ్రీహరి, అవంతి ప్రిన్సిపల్స్ డాక్టర్ బి.మురళీకృష్ణ, గోవింద రావు, రాజు, రామకృష్ణ, డైరెక్టర్లు డాక్టర్ చంద్ర శేఖర్, రాఘవ రావు, ప్లేస్ మెంట్ అధికారులు శ్రీనివాసరావు, రూప్ సుందర్, పాల్గొన్నారు

విద్యార్థులకు ట్యాబ్ల పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం శొంట్యాంలో శుక్రవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ట్యాబ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో కంప్యూటర్ ఆవశ్యకత చాలా ముఖ్యమని చెప్పారు. 642 ట్యాబ్లు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆడప లవరాజు, జడ్పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, సర్పంచ్ లంక రాంబాబు, ఎంపిటిసి సభ్యులు పల్లాదుర్గ, రమణారావు, మార్కెట్ డైరెక్టర్ రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు

నారాయణ మెడ్సిటీలో అరుదైన చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : మూత్రపిండాలు, గుండె, ప్యాంక్రియాటిక్ ఇన్ఫెక్షన్తో అత్యంత ప్రాణాపాయ స్థితిలో వెంటిలేటర్పై శ్వాశ తీసుకుంటూ వచ్చిన వ్యక్తికి నారాయణ మెడ్ సిటీ ఆసుపత్రి వైద్యులు నయం చేసి పంపించినట్లు ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ టి.నారాయణరావు తెలిపారు. ఆరిలోవ హెల్త్సిటీలోని నారాయణ మెడ్ సిటీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ, విశాఖ నగరానికి చెందిన జి.కమలాకర్ (40) ముత్రపిండాలు, గుండె, ప్యాంక్రియాటిక్ ఇన్ఫెక్షన్తో ఈ నెల 19న తమ ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. అప్పటికే కమలాకర్ రావు బ్లడ్ ప్రెజర్, పల్స్ వాల్యూస్ రికార్డు అవ్వలేదని, ప్యాంక్రియాస్ ఇన్ఫెక్షన్తో శరీరంలో కొన్ని ఆర్గాన్స్ చెడిపోయే స్థితికి వచ్చాయని వివరించారు. ఆసుపత్రి వైద్య బృందం స్పందించి కమలాకర్రావును రెండు రోజుల్లోనే వెంటిలేటర్తో శ్వాస తీసుకున్న స్థితి నుంచి సాధారణ స్థితికి తీసుకొచ్చినట్టు తెలిపారు. అత్యంత అధునాతనమైన అంతర్జాతీయ స్థాయి వైద్యవిధానంతో, నైపుణ్యం గల వైద్యుల ట్రీట్మెంట్తో ఆయన తొందరగా కోలుకున్నట్లు చెప్పారు. శుక్రవారం డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్లు విజయ్కుమార్రావు, ఆదిత్య, గాయత్రి, బి.అచ్యుత్ పాల్గొన్నారు.

బిజెపికి తోట నగేష్ రాజీనామా

ప్రజాశక్తి-సీతమ్మధార : బిజెపి ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర కార్య నిర్వాహక సభ్యుని పదవికి రాజీనామా చేస్తున్నానని తోట నగేష్ ప్రకటించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి రాజీనామా లేఖ పంపుతున్నానని తెలిపారు. స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రయత్నాలు దారుణమని, అధికార, ప్రతిపక్షాలు కూడా పోరాటం చేయడం లేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రజల సమస్యల మీద బిజెపి ఉద్యమం చేయడం లేదని తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది సమ్మె మీద కూడా పోరాటం చేయలేని దుస్థితిలో బిజెపి ఉందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి ఒంటరిగా పోటీ చేస్తే ఒక్కో నియోజకవర్గంలో 2,500 దాటి ఓట్లు రావన్నారు. సుగర్ ఫ్యాక్టరీలను కేంద్రం ఆదుకునే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక సమస్యల మీద ఉద్యమం చేయడం కోసమే బిజెపికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. అనుచరులు, శ్రేయోభిలాషులతో చర్చించిన మీదట తాను ఏ పార్టీలో చేరుతానో త్వరలోనే ప్రకటిస్తానన్నారు.

అవినీతికి పాల్పడిన బ్యాంకు అధికారికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- లీగల్ : రుణ గ్రహీతకు అనుకూలంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఆమోదించి అవినీతికి పాల్పడిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారికి ఐదేళ్లకఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సిఎం మూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.6000 జరిమానా కూడా విధించారు. నిందితుడు ఎం.సుధాకరరావు విశాఖ యూనియన్ బ్యాంకులో అధికారిగా పని చేసేవారు. ఫిర్యాది మెసర్స్ మాస్టర్ స్టీల్ క్యాబ్స్ కంపెనీకి రూ.60,49,227 రుణం మంజూరు చేయడానికి వారి నుంచి లంచం తీసుకున్నాడు. కంపెనీ యాజమాన్యం సిబిఐకి ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా రుణం మంజూరు చేసినట్లు గుర్తించారు. నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి 420, 120 ఎ సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

లైంగిక దాడిలో 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- లీగల్ : బాలికపై లైంగిక దాడి చేసి గర్భవతికి కారణమైన వ్యక్తికి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ నగరంలోని ఫోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని శుక్రవారం తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.4 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాల మేరకు... పెదగంట్యాడ ధారవీధిలోని బాధిత బాలికను అదే ప్రాంతానికి చెందిన నిందితుడు ఎరుపల్లి దేవుడు (50) 2018 జనవరి ఒకటో తేదీన బీడీలు తెమ్మని కిరాణా షాపుకు పంపించాడు. ఆ చిన్నారి నిందితునికి బీడీలు ఇవ్వడానికి అతని ఇంటికి వెళ్లగా, ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఆరు నెలల పాటు లైంగిక దాడి కొనసాగించాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. బాలిక తల్లిదండ్రులు న్యూ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

పిఎఫ్ అధికారికి జ్యూట్ కార్మిక సంఘాల వినతి

ప్రజాశక్తి -తగరపువలస : అపరిష్కృతంగా ఉన్న జ్యూట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిఎఫ్ అధికారి వీర మణికాంత్కు శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు కాకాస అధ్యక్షులు జెవి.కైలాష్రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ, చిట్టి వలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, కె రాంబాబు తెలిపారు. దరఖాస్తు చేసిన కార్మికులకు ఇప్పటికీ పిఎఫ్ చెల్లింపులు జరగలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆర్టిఐ ద్వారా పూర్తి వివరాలను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

కెజిబివిని సందర్శించిన నేవీ అధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిని ఐఎన్ఎస్ కళింగలోని కొందరు నేవీ అధికారులు, కుటుంబ సభ్యులు శుక్ర వారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడా పరికరాలను విద్యార్థినులకు అందజేశారు. ప్రిన్సిపల్ గంగాకుమారి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు

అప్పన్న నిత్యాన్నదానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచలం దేవస్థానంలో నిత్యాన్నదానానికి హైదరాబాద్ ఇబ్రహీంపట్నం చెందిన దుప్పలాపాటి శ్రీనివాసరావు, సౌమ్య దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఇన్చార్జి ఎఇఒ పాలూరి నరసింహారావుకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాతలకు స్వామి దర్శనాన్ని కల్పించారు. స్వామి ప్రసాదాన్ని అందించారు. విరాళం మొత్తానికి దాతలకు బాండును అందజేశారు.

మరుగుదొడ్ల మరమ్మతులు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, చిప్పాడ దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ.53 వేలతో భీమిలి మండలం, కొసనవానిపాలెం, పైలపేట ఎంపి ప్రాథమిక పాఠశాలకు చెందిన పలు మరుగుదొడ్లను మరమ్మతు చేసినట్లు సిఎస్ఆర్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్ తెలిపారు. సంబంధిత మరుగుదొడ్లను శుక్రవారం వినియోగంలోనికి తీసుకొచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రభాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకాశం జిల్లా సంతనూతల పాడు మండలం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 30, 31 తేదీల్లో జరుగనున్న 42వ ఎపి సబ్ జూనియర్స్ బాలురు, బాలికల అంతర్ జిల్లా షూటింగ్ బాల్ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలకు తమ పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు గాను సంబంధిత విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలో కుష్టు వ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కుష్టు నిర్మూలనా కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సత్యవాణి వైద్య సిబ్బందికి ఆదేశించారు. నేలతెరులోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలడం లాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ఈ విషయంపై అవగాహనా పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి లక్షణాలు తెలిపే పోస్టర్ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి, డిప్యూటీ పారా మెడికల్ అధికారి భీమేశ్వర రావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

రెయిన్బోలో పిడియాట్రిక్ సర్జరీ దినోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయ రెయిన్బో ఆసుపత్రిలో జాతీయ పిడియాట్రిక్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ రవి హిమజ నేతృత్వంలో సర్జరీ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాధారణ ప్రజలు, రెయిన్ బో ఆసుపత్రిలో చికిత్స పొంది విజయవంతంగా బయటపడ్డ చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్యం కాపాడటంలో పిడియాట్రిక్ సర్జన్లు పోషించే పాత్ర అనే అంశంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ, చిన్నారుల అవయవాలకు శస్త్ర చికిత్స చేయడం అంత సులభం కాదన్నారు. శిక్షణ పొందిన పిడియాట్రిక్ సర్జన్ మాత్రమే చేయగలరన్నారు. రెయిన్ బో ఆసుపత్రిలో ప్రతి బిడ్డకు అత్యుత్తమ చికిత్స అందుబాటులో ఉందన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వయసు గల వారి వరకు అత్యుత్తమ సేవలు రెయిన్బో ఆసుపత్రిలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశ్వత్ మొహంతి, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ విశాల్ జె కోలే, డాక్టర్ అన్వేష్ అమిత్, డాక్టర్ బాల శ్రీలత పులి బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఎమ్‌డి అతుల్‌బట్

కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌బట్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల జీతాలు ఒకటవ తేదీనే చెల్లించేలా, బిఎఫ్-3 ఉత్పత్తి జరిపి లాభాల్లోకి వచ్చిన వెంటనే ప్రమోషన్లు, వేజ్ రివిజన్ లాంటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ లైజన్ ఆఫీసర్ వి.తిరుపతిరావు, అధ్యక్ష, కార్యదర్శులు బోండా తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, కెవి.రత్నం, ఎల్‌వి.రమణారావు, దాసరి పుల్లారావు, ఎస్.మోహన్‌బాబు, వేణుగోపాలరావు, పైడి కొండలరావు, ఫణీంద్రబాబు, లక్ష్మణమూర్తి, తిమోతిబాబు, సత్తిబాబు, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.



త్రిఫ్ట్ సొసైటీ ఐడి కార్డును విడుదలచేస్తున్న అయోధ్యరామ్ తదితరులు

త్రిఫ్ట్ సొసైటీ ఐడి కార్డ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : నూతన సంవత్సరం సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఐడి కార్డును కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, అభివృద్ధి పథంలో పయనిస్తున్న స్టీల్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని పాలకవర్గాన్ని కోరారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు పాలకవర్గం తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె.ఆనంద్‌కుమార్, కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి డివిఎస్ఎన్.కొండరాజు, డైరెక్టర్లు కె.శ్రీనివాస్, ఎవి రమణ పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ సివి.రావు

నైతిక విలువలు పెంపొందేలా విద్యా విధానం

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేదిగా విద్యా విధానం ఉండాలని ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ సివి.రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం సీతంపేటలోని విటి స్కూల్ ప్రాంగణంలో పాఠశాల 77వ వసంతాల సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరి అభ్యున్నతికి పాఠశాల పునాదిరాయిగా నిలుస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పారిశ్రామిక ప్రగతికి భాగమయ్యే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రముఖ న్యాయవాది పి.వి.నారాయణరావు మాట్లాడుతూ, విద్యతోపాటు విలువలను నేటి తరానికి అందించడంలో వి.టి స్కూల్ ముందుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.రావు మాట్లాడుతూ విశాఖలోని పాతనగరం వేదికగా 1946లో ప్రారంభించిన వి.టి స్కూల్ గడచిన 77 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది సమాజానికి అందించిందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పి.రమణారావు మాట్లాడుతూ, శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల ద్వారా బహుమతులను ప్రదానం చేశారు. నెమలి నృత్యం, దశావతారం, థింసా నృత్యం, నాటు- నాటు డాన్స్, ఫ్యూజన్ నృత్యాలు అలరించాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం పలుచోట్ల ప్రయివేటు కార్మికులచే చేపట్టే పనులను, యార్డుల నుంచి బయటకు వచ్చే వాహనాలను కార్మికులు అడ్డుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం సంగతి తేలుస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. జివిఎంసి జోన్ 4 టౌన్ కొత్త రోడ్ వద్దగల సూయజ్ ఫారం వద్ద జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి మున్సిపల్ కార్మికులు రాత్రులు, పగలూ తేడా లేకుండా సమ్మె చేస్తుంటే మంత్రులు, ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని జగన్ హామీ ఇచ్చారని, ఇంతవరకూ దాన్ని నెరవేర్చకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రభుత్వం దిగి వచ్చేవరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. సమస్యలను పరిష్కరించకుండా సమ్మెను అణచివేస్తాం.. ఉద్యోగాలు తీసేస్తాం అంటే ఈ ప్రభుత్వాన్నే దింపేస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకట రెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, నాయకులు ఎం.ఈశ్వరరావు, అప్పలరాజు, సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, అనిత, అశోక్, రామలక్ష్మి, పెద్ద సంఖ్యలో పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు కార్యాలయం వద్ద వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. చెత్త తరలించేందుకు వచ్చిన వాహనాలను ముందు కార్మికులు అడ్డుకున్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి పిల్లా వెంకటరావు తన కార్యకర్తలతో వచ్చి కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగోతి శివాజీ, సిఐటియు నాయకులు ఎస్.రామప్పడు, బి.రాంబాబు, కె.రాజు, వి.గోవిందా, యు.లక్ష్మి, బి.చిన్నమ్ములు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో కార్మికులు చేపట్టిన దీక్షకు భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్మికులు, టిడిపి నాయకులు దొరబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి : 95వ వార్డు పరిధి చీమలాపల్లి డంపింగ్ యార్డ్ వద్ద పారిశుద్ధ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం పలు రూపాల్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాజు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

అనకాపల్లి : మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె నాలుగవ రోజు శుక్రవారం కొనసాగింది. జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం వద్ద వారు చేపట్టిన ఆందోళనకు అఖిల పక్ష కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులతో చర్చలు చేసిన మంత్రి ఆదిమూల సురేష్ సమస్యలు పరిష్కారం చేయకుండా సమ్మెను వాయిదా వేయమని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 13 డిమాండ్లకు మూడు డిమాండ్లను మాత్రమే పరిష్కారం చేస్తామని చెప్పిడం దారుణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, ఎఐటియుసి నాయకులు వైఎన్ భద్రం, బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్, నూకరాజు , శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.



జోన్-4 సూయజ్‌ఫామ్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

మోకాళ్లపై నిరసన

నర్సీపట్నం టౌన్: పట్టణంలో మున్సిపల్ కార్మికుల మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, మున్సిపల్ యూనియన్ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కుపరాల రాజు, నేతల దేముడు, రమణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెకు బిఎస్పీ నాయకులు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి పార్టీ నాయకులు కొల్లు గంగాధర, ఆనంద్, అప్పలనాయుడు, నవీన్, నాయుడు, జగదీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విచ్ఛిన్నానికి యత్నం : ఐక్యంగా తిప్పికొట్టిన కార్మికులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు అధికారులు శుక్రవారం చేసిన ప్రయత్నాలను పారిశుధ్య కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టారు. జివిఎంసి రెల్లివీధి వద్ద ఖాళీ స్థలంలో యథాప్రకారం నిలిపిన చెత్త ఎత్తడం, తరలించడానికి వినియోగించే వాహనాలను రోడ్డు మీదకు బలవంతంగా తీసుకొచ్చేందుకు అధికారులు చేసే ప్రయత్నాన్ని కార్మికులు కలిసి కట్టుగా అడ్డుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జివిఎంసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి జోన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారిని రెచ్చగొట్టే చర్యలకు దిగడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

భయం వద్దు.. జాగ్రత్తలు పాటించాలి

కరోనా వ్యాప్తిపై డిఎం అండ్ హెచ్‌ఓ జగదీశ్వరరావు



ప్రజాశక్తి-సీతమ్మధార : కరోనా వ్యాప్తి నేపథ్యంలో అందరూ తగు జాగ్రత్తలు పాటించాలని, మాస్కులు ధరించాలని డిఎం అండ్ హెచ్‌ఒ పి.జగదీశ్వరరావు కోరారు. ప్రజాశక్తితో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కరోనా గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలోని యుపిహెచ్‌సిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శీతాకాలం వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అందరూ మాస్కులు పెట్టుకుని, భౌతిక దూరం పాటిస్తూ, శానిటైజర్లతో శుభ్రం చేసుకుంటుండాలని కోరారు. వైరస్ ప్రభావం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రతి రోజూ రాపిడ్ టెస్ట్‌లకు 100 శాంపిల్స్ సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 280 టెస్టులు చేశామని, 14 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని వివరించారు. చికిత్స నిమిత్తం కెజిహెచ్, విమ్స్, చెస్ట్ హాస్పిటళ్లలో 100 పడకలు చొప్పున ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆక్సిజన్ సిలిండర్లు, 5000 కిట్లు, 300 ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో పలుచోట్ల ఏర్పడే రద్దీ సందర్భాల్లో తప్పని సరిగా కరోనా నివారణ జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఉక్కు అధికారికి ఎంబిఎలో గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు కర్మాగారం బ్లాస్ట్ ఫర్నేస్ విభాగంలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.గోపాల్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి ఎంబిఎ (మార్కెటింగ్)లో గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన 25వ స్నాతకోత్సవంలో యుజిసి ఛైర్మన్ ఎం.జగదీష్ కుమార్ ద్వారా గోపాల్‌కు గోల్డ్ మెడల్ అందజేశారు. 2009లో విశాఖ ఉక్కు కర్మాగారంలో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా జాయిన్ అయిన గోపాల్ ప్రస్తుతం సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గోపాల్ హైదరాబాద్ జెఎన్‌టియులోని బి.టెక్ (మెకానికల్), ఆ తర్వాత ఎన్‌ఐటి (వరంగల్)లో ఎంటెక్ చేశారు. గోపాల్‌కు గోల్డ్ మెడల్ రావడం పట్ల పలువురు అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.



ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

ప్రజాశక్తి-పేపగుంట : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటుచేసుకొని ముందుకు సాగాలని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీధర్ పట్నాయక్ సూచించారు. నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమో మొదటి సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలను ద్వితీయ సంవత్సర విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తోటి విద్యార్థుల, అధ్యాపకులతో ఎలా మెలగాలో వివరించారు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ పి.ప్రసాద్, కళాశాల ఛైర్మన్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడలిస్టులకు అభినందనలు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం గొల్లవీధికి చెందిన వాకాడ రేష్మి యాదవ్, వాకాడ ప్రవళికయాదవ్ ఇటీవల విజయనగరంలో జరిగిన అండర్ 17, అండర్ 19 బాలికల విభాగం బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంతో వారిని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ శుక్రవారం అభినందించారు. వారికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. బాలికలిద్దరూ వచ్చేనెల 3, 4 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న నేషనల్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ, మున్సిపల్, సమగ్ర శిక్ష కార్మికుల సమ్మెలకు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా 18 రోజులుగా అంగన్వాడీలు, పది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు, నాలుగు రోజులుగా మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేస్తున్న సమ్మెలకు కార్మిక, రైతు, ప్రజా సంఘాలు మద్దతు తెలియజేశాయి. ఇందులో భాగంగా శుక్రవారం సిఐటియు, ఏఐటియుసి, రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఎన్టిఆర్ మున్సిపల్ స్టేడియం వరకు సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించమంటే అప్పులున్నాయని చెబుతుందని, మరోవైపు ఆర్భాటాల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని విమర్శించారు. నాలుగున్నర సంవత్సరాలుగా ధరలు 300 రెట్లు పెరిగాయని, ఇందుకు అనుగుణంగా జీతాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? అని ప్రశ్నించారు. ఏఐటియూసీ జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంటా శ్రీరామ్, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, మాజీ కౌన్సిలర్ టి.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు కె.లక్ష్మణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, ముఠా కార్మిక సంఘం జిల్లా నాయకులు భీసెట్టి అప్పారావు, అల్యూమినియం యూనియన్ నాయకులు ప్రసాదు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సూర్యకళ మాట్లాడారు. కార్యక్రమంలో బి.రాజు, సురేష్, రమణ, చిన్నారావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న కార్మిక, రైతు, ప్రజా సంఘాల నేతలు, కార్యకర్తలు

ఎస్సి, ఎస్టిలపై అత్యాచారాలు జరగకుండా పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఎస్సి, ఎస్టిలపై ఎటువంటి అత్యాచారాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులలో బాధితులకు న్యాయంతో పాటు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని చెప్పారు. కలెక్టరేట్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సి ఎస్టీల భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి కె.మురళీకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, అడిషనల్ ఎస్పి విజయ భాస్కర్, డిఆర్ఓ బి.దయానిధి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు చిన్నికృష్ణ, జయరాం, అనకాపల్లి పరవాడ డీఎస్పీలు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి అజయ్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో 30,919 మందికి విద్యా దీవెన

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో జగనన్న విద్యాదీవెన కింద 30,919 మంది విద్యార్థులకు రూ.20,33,16,588 మొత్తం ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్ జగనన్న విద్యా దీవెన 4వ విడత నిధుల పంపిణీ నమూనా చెక్కును తల్లులు, విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు 4వ విడత కింద జిల్లాలో బి.సి.కార్పొరేషన్ ద్వారా 27,099 మంది బిసి, ఈబిసి, కాపు విద్యార్థులకు రూ.17,64,09,496, ఎస్సి సంక్షేమ శాఖ ద్వారా 3,194 మంది విద్యార్థులకు రూ.2,33,51,626, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 431 మంది విద్యార్థులకు రూ.21,30,692, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 195 మంది క్రిస్టియన్, ముస్లిం, మైనారిటీ విద్యార్థులకు రూ.14,24,774 జమ అవుతాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్పర్సన్ బివి.సత్యవతి, బీసీ సంక్షేమ శాఖ డిడి కే.రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని అచ్యుతాపురం, హరిపాలెం, కొండకర్ల, ఖాజీపాలెం, పెదపాడు, ఎంజే పురం, పూడిమడక, మడుతూరు, దోసూరు తదితర హైస్కూళ్లకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ అచ్యుతాపురం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు మద్దెల నానాజీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయిలో నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయుల చేత ఈ మెటీరియల్ తయారు చేయించి అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు కె.మహిమారావు, జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం వెంకటప్పారావు, మండల కార్యవర్గ సభ్యులు ఈ అరుణ, జి నీరజ, కె పారిజాతం, ఎస్ ర్యూస్సీ, ఆర్ రవివర్మ, టి.సత్యనారాయణ, ఎస్.సలీమ్, కె.కొండబాబు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

72 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో 2023-24 ఖరీఫ్ సీజన్కు గాను 72 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్ ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. జిల్లాలో 343 ఆర్బికే కేంద్రాలగాను 72 క్లస్టర్ రైతు భరోసా కేంద్రాల ద్వారా (53 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 19 రైతు ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్) ఆధ్వర్యంలో ధాన్య సేకరణ జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాల్లో సిబ్బందిని, గోనె సంచులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంచుల ముద్రణ, సరఫరాకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష 2 కార్యక్రమంలో భాగంగా సంచుల ముద్రణ, సరఫరా చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ హేమంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను anakapalli.ap.gov.in వెబ్సైట్ నుంచి డిసెంబర్ 30 నుంచి 2024 జనవరి 1 వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పైన తెలిపిన తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం, అనకాపల్లిలో జనవరి 1లోగా అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు ఎన్హెచ్ఎం, డిపిఎం యూనిట్, డిఎంహెచ్ఒని సంప్రదించాలన్నారు.

లారీ నుంచి పడిన బండరాయి

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-మునగపాక : భారీ వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంలో నిత్యం ఏదో రూపంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. శుక్రవారం మండలంలోని నాగులపల్లి గ్రామం జేఎంజే స్కూల్ సమీపంలో పెను ప్రమాదం తప్పింది. క్వారీల నుండి అచ్యుతాపురం కంపెనీలకు కొండ రాళ్లను తరలిస్తున్న లారీ నుండి పెద్ద బండరాయి రోడ్డు పక్కనే ఫ్యాబ్రికేషన్ వర్క్స్ చేస్తున్న వ్యక్తి పక్కన పడటంతో ప్రాణాపాయం తప్పింది. అదే మార్గంలో పయనిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఆడారి జనార్దన్ లారీని ఆపి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లారీని అదుపులోకి తీసుకుని స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిమితికి మించి అధిక లోడుతో వెళ్తున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాంకీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం


రైతులకు మద్దతుగా దీక్షలో కూర్చున్న లోకనాథం

ప్రజాశక్తి - పరవాడ

రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. మండలంలోని పరవాడ పెద్ద చెరువు వద్ద రైతులు 19 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శుక్రవారం లోకనాథం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం అక్రమంగా చెరువుల్లోకి సిఈటిపి నుండి వ్యర్థ రసాయనాలను విడిచి పెడుతుందని, దీనివల్ల మత్స్య సంపద నాశనమవుతుందని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయం పండడం లేదని, పాడిపశువులకు సూలు నిలవడం లేదని, స్థానికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, కేన్సర్, ఊపిరితిత్తులు, కిడ్నీ, చర్మ, శ్వాసకోశ సంబంధ జబ్బులతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలుష్యానికి కారణమైన రాంకీ యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. దీనిపై వైసిపి ప్రభుత్వం తగిన విధంగా స్పందించడం లేదన్నారు. రాంకీ యాజమాన్యానికి అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే రాంకీ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రైతులు పైలా అప్పారావు, శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విలువలకు కట్టుబడిన పత్రిక ప్రజాశక్తి

కేలండర్ ఆవిష్కరణలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

ప్రజాశక్తి దిన పత్రిక పత్రిక విలువలకు కట్టుబడి పనిచేస్తుందని, వార్తలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేడయంలో ముందుంటుందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ప్రజాశక్తి ప్రచురించిన 2024 నూతన సంవత్సర కేలండర్ను గురువారం ధర్మశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కేలండర్ మంచి నాణ్యతగా కలర్ ఫుల్గా అందివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి గాడి కాసు, ఎంపీడీవో ఎస్వీడీ శ్యాంసుందర్, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, నాయకులు వెంపలి ఆనందేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, బొడ్డేటి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, దేవరపల్లి సత్య, ఒరుగంటి నెహ్రు బాబు, శివాలయ కమిటీ చైర్మన్ జి సత్యనారాయణ, ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ వై.గణేష్, విలేకరి కోవెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ప్రజాశక్తి కేలండర్ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ తదితరులు

ఎన్టీఆర్ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్కు శంకుస్థాపన

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి ఎన్టిఆర్ ఆసుపత్రిలో రూ.22.5 కోట్లుతో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి విజయవాడ జిజిహెచ్ ఆసుపత్రిలో కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఇందులో పాల్గొన్న అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి విజయవాడ నుండి చరవాణి ద్వారా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రంలో 14 క్రిటికల్ కేర్ బ్లాకులు, 7 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ సెంటర్లను మంజూరు చేసినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకి, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విశాఖ ప్రజలను మోసగిస్తున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి : 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా జగన్ రెడ్డి ఉమ్మడి విశాఖ జిల్లాకు ఇచ్చిన అమలు చేయకుండా ఇక్కడి ప్రజలను మోసగిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 95.5శాతం అమలు చేశామని గొప్పలు చెప్పిన జగన్ రెడ్డి, విశాఖ జిల్లాకు సంబంధించి ఇచ్చిన 44 హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు ధనాల విష్ణు చౌదరి, కొట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, మళ్ల శివన్నారాయణ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్లో బీటెక్ (మెకానికల్) చదివి 18 నుండి 26 సంవత్సరాల వయసు గల యువతి, యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్లో శిక్షణతో పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందని, శిక్షణ తర్వాత సంబంధిత రంగంలో ఉద్యోగం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9492429425 నెంబర్కు సంప్రదించాలని కోరారు.

పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్కు 13 దరఖాస్తులు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి 13 దరఖాస్తులు వచ్చాయి. పోలీసు సిబ్బంది తమ అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి విన్నపాలను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని అరబుపాలెం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధనశాఖ శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 40 పశువులకు గర్భకోశ చికిత్సలు, 15 లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధన శాఖ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ రామ్మోహన్ రావు, పశు వైద్యులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మద్దతు తెలియజేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. తమ సమస్యలపై సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో భాగంగా 10వ రోజు డిఇఒ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షా శిబిరాన్ని శుక్రవారం లోకనాథం సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎళ్ల తరబడి పని చేస్తున్న సమగ్ర శిక్ష, జిల్లా, మండల విద్యాశాఖ పరిధిలోని వివిధ విభాగాల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిఆర్‌పిలు, కెజిబివి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, సిఆర్ఎంటిలు, పిటిఐ టీచర్లు, భవిత కేంద్రాల ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రెగ్యులర్ చేస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డి హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. పిఆర్సీ అమలు, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయకపోవడం, ఉద్యోగ భద్రత, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్న డిమాండ్‌ను పట్టించుకోక పోవడం సరికాదన్నారు. నిత్యవసరాల ధరలు, రవాణా, పెట్రోల్, గ్యాస్, విద్యుత్ చార్జీలతో, పిల్లల ఫీజులు, వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగి నేడు కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో సమగ్ర శిక్ష ఉద్యోగులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేస్తున్న పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని చెప్పారు.

విశాఖ కలెక్టరేట్ : సమస్యల పరిష్కారం కోసం పది రోజులుగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం జాతీయ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. ముందుగా దీక్షా శిబిరానికి సమీపంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య, నాయకులు పార్వతి, శ్రీనివాస్, లక్ష్మి, శ్రీరామమూర్తి, వినోద్, సయిదా సుల్తానా, రాంబాబు, వసుమతి పాల్గొన్నారు.



షూటింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

అసకపల్లిలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అసకపల్లి గ్రామంలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'కంచర్ల' అనే సినిమాను నిర్మిస్తున్నట్లు సినీ కో-డైరెక్టర్ బత్తిన సూర్యనారాయణ తెలిపారు. రెడ్డెమ్ యాద్ కుమార్ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కంచర్ల ఉపేంద్ర హీరోగా, ఆయన సరసన మీనాక్షి, ప్రణతి ఇద్దరు హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కంచర్ల నిర్మాతగా పనిచేస్తున్నారు. గ్రామీణ వాతావరణంలో పంచాయితీ కార్యాలయం, రామాలయం ఎదురుగా షూటింగ్ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సూర్యప్రకాశ్, గంటా జనార్దన్, సర్పంచ్ కర్రి నర్సింగరావు, పెచ్చెట్టి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రసవాలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేటట్టు చూడాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కె కోటపాడు సిహెచ్సిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించారు. స్థానికంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కేసులు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోషకాహార లోపంపై వైద్యులు ముందస్తుగా చూడాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, వైద్యులు శ్రీనివాసరావు, రెడ్డి రమ పాల్గొన్నారు.

నంగినారపాడు
పాల సొసైటీ అధ్యక్షులుగా ఇందల

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోని జివిఎంసి 88వ వార్డు పరిధి నంగినారపాడు పాల సొసైటీ అధ్యక్షులుగా అజనగిరికి చెందిన ఇందల వెంకట రమణ ఐదో సారి ఎన్నికయ్యారు. పాల సొసైటీ అధ్యక్షుడుగా 25 సంవత్సరాలుగా పూర్తి చేసుకున్న వెంకటరమణను అగనంపూడి అఖిలపక్ష నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు బలిరెడ్డి అప్పారావు, మోటూరి వెంకటరమణ, టిడిపి నాయకులు వడ్డాది శ్రీను, లైన్స్‌క్లబ్ ప్రతినిధి కడిమి హనుమంతరావు, విందల వరహాలు, విందుల నారాయణరావు పాల్గొన్నారు.

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. 2023-2024 సంవత్సరం సవరణ బడ్జెట్, 2024-2025 అంచనా బడ్జెట్ ఆమోదించారు. 2023-2024 అంచనా బడ్జెట్ రూ.39,41,65,000, సవరణ బడ్జెట్ రూ.40,08,30,000 అని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూసి అప్పలరాజు, కన్నూరు ఎంపిటిసి గొల్లవిల్లి శ్రీనివాసరావు, కలపాక ఎంపిటిసి సప్పప్రభ, తానం ఎంపిటిసి రొంగలి సునీత, తిక్కవానిపాలెం ఎంపిటిసి సురాడ బంగారురాజు, పెదముషిడివాడ ఎంపిటిసి ఓమ్మి వెంకటరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్డాదిలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టి సంక్షేమ పథకాలు అందించాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉపాధి కల్పించాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దొండా నరేష్, సింగంపల్లి రమేష్, సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, అక్కిరెడ్డి కనకరాజు, గురుమూర్తి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడే
నూతన సంవత్సర వేడుకలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్పి

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రజలు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్‌పి మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలలో ప్రజల భద్రత దృష్ట్యా ఈవెంట్‌లు/ కార్యక్రమాలు నిర్వహించబోవు హోటళ్లు, క్లబ్‌ల నిర్వాహకులు ముందుగా ఎస్‌పి కార్యాలయం నుండి అనుమతి తీసుకోవాలని, లేకుంటే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయటకు/లోపలికి వచ్చే మార్గాలలో, పార్కింగ్ ప్రాంతాలలో నిర్వాహకులు కచ్చితంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్, భద్రత అదుపులో ఉండేందుకు తగిన సిబ్బందిని వారే నియమించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో వేసే దుస్తులు, చేసే నృత్యాలు, మాట్లాడే విధానాల్లో ఎటువంటి అశ్లీలత, నగ్నత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. డీజే/స్పీకర్స్ శబ్దాన్ని 45 డిసిబెల్స్‌ను మించరాదని, కార్యక్రమ వేదిక వద్ద ఎటువంటి బాణసంచా/ పేలుడు పదార్థాలు అనుమతించరాదని తెలిపారు. సామర్థ్యానికి మించి పాస్‌లు/టికెట్లు/కూపన్‌లు మంజూరు చేయరాదన్నారు. బార్లలో ప్రత్యేకంగా దంపతులు/ జంటల కోసం నిర్వహించే కార్యక్రమాలలో మైనర్లను అనుమతించకూడదని ఆదేశించారు. డ్రగ్స్, నార్కోటిక్స్, సైకోట్రోపిక్ పదార్థాలను ఉపయోగించకూడదన్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అనుమతించిన సమయం వరకూ మాత్రమే మద్యాన్ని అందించాలని, తాగిన స్థితిలో ఉన్న కస్టమర్‌లు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి డ్రైవర్లు/క్యాబ్‌లను అందించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని బార్ల నిర్వాహకులను ఆదేశించారు.

భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా
న్యాయవాదుల మానవహారం

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న భూహక్కు చట్టానికి వ్యతిరేకంగా కోర్టు వద్ద రిలే దీక్షలు చేస్తున్న న్యాయవాదులు శుక్రవారం స్థానిక కొత్తూరు జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. వీరికి నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు, టిడిపి నాయకులు బ్రహ్మానాయుడు, సామాజిక కార్యకర్త డిఎస్ ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాండ్రేగుల డేవిడ్ మాట్లాడుతూ 27/2023 భూహక్కు చట్టం పేద మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణవేణి, అల్లు గిరిధర్, జిపి సత్యనారాయణ, బి.రాజు, డీజే ప్రకాష్‌రావు, డిపిఓఆర్ సాంబమూర్తి, వివిఎన్ మూర్తి, ఎం శ్రీనివాసరావు, వీపురుపల్లి సూర్యనారాయణ, జి లక్ష్మీనారాయణ, ఎస్ వరలక్ష్మి, డి సత్యవతి బి గౌరీ దేవి, కొల్లి శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

ప్రజాశక్తి-చోడవరం : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని సినీ నిర్మాత నట్టి కుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ధరలు అదుపు చేయలేని ప్రభుత్వం మద్యం ఆదాయంతో పథకాల ప్రజలకు అందిస్తుందన్నారు. అంగన్వాడీల సమస్యను పరిష్కరించలేని ప్రభుత్వం 500 కోట్ల రూపాయలతో విశాఖపట్నంలో బంగ్లా నిర్మించుకుందని పేర్కొన్నారు. విశాఖ రాజధాని పేరు చెప్పి వేలాది ఎకరాల భూములను వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు కాజేశారని ఆరోపించారు. తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే జగన్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో పట్టనుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైసిపి అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నకర్ అన్నారు. గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి రామాలయం, ఇతర రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలలో కన్నబాబు ఓటమి ఖాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రానున్న ఎన్నికలలో యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ఓటమి ఖాయమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఎస్ఇజెడ్ దిబ్బపాలెం పునరావాస కాలనీలో జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ లాలం భవాని భాస్కర్ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను ఎమ్మెల్యే కన్నబాబురాజు పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా 100 కుటుంబాలు జనసేన పార్టీలో సుందరపు సమక్షంలో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, నాయకులు టెక్కలి పరశురాము, లాలం చందు, పైలా రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ కార్డు కార్మికులకు బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నుండి ఆరు నెలలుగా జీతం బకాయిలు ఉన్నాయన్నారు. జీతాలు రాక పారిశుధ్య కార్మికులు పండగ పూట కూడా పస్తులున్నారని, వచ్చే సంక్రాంతి పండగ కూడా జీతాలు రాకపోతే వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులకు అతి తక్కువ వేతనాలు నెలకు రూ.3000 నుండి రూ.6000 మాత్రమే చెల్లిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం రూ.10000 వేతనం ఇస్తామని సర్క్యులర్ ఇచ్చినా ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పలివెల చిన్నారావు, కార్యదర్శి అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు ములకలపల్లి అప్పలరాజు,లోకేష్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా నుండి రెండు ప్రాజెక్టులు

ప్రజాశక్తి-అనకాపల్లి

వచ్చేనెల 27 నుంచి 5 రోజులపాటు విజయవాడలో జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు అనకాపల్లి జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు. వైయస్సార్ కడప జిల్లాలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో గెలుపొందిన ఉపాధ్యాయుల కేటగిరీలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రఘు రమేష్ తయారు చేసిన మోడల్ క్రియేటింగ్ వీడియో, ఆగ్మెంట్ రేడియాలజీ, గ్రూప్-2 కేటగిరీలో ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె.ఆదినాయుడు, విద్యార్థులు పి సాయిబాబా, ఆర్.భానుతేజ తయారు చేసిన మోడల్ స్మార్ట్ హౌస్ సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్టు వెల్లడించారు. విజేతలకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎస్ ప్రతాపరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రాజెక్టులకు ఎంపిక కావడం పట్ల వీరిని డీఈవో వెంకట లక్ష్మమ్మ, జిల్లా ఉపవిద్యా శాఖ అధికారి పి అప్పారావు, ఏడి రవిబాబు అభినందించారు.

పట్టు విడువక...

-18వ రోజుకు అంగన్వాడీల సమ్మె



విశాఖలో ఎంపీ ఎంవివి ఇంటి వద్ద బైఠాయించిన అంగన్వాడీలు


గొలుగొండలో...

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరింది. సమ్మె శిబిరాల్లో అంగన్‌వాడీలు ఆందోళనలు చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

నక్కపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరింది. మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష శిబిరం వద్ద అంగన్వాడి వర్కర్స్ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. 18 రోజుల నుండి తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నేటి వరకు సమస్యలు పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 26 వేలు కనీస వేతనం అమలు చేయాలని ,గ్రాడ్యుటి అమలు చేయాలని ,ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు .సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, యూనియన్ నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మి, రమణమ్మ, జయ, ఆర్‌వికె లక్ష్మీ పాల్గొన్నారు .

మాడుగుల: స్థానిక బస్టాండ్ ఆవరణలో మండల అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 18 రోజులుగా కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదని సిఐటియు నాయకులు ఇరట నరసింహమూర్తి విమర్శించారు. రిలే దీక్షా శిబిరంలో మాడుగుల ప్రాజెక్టు యూనియన్ నాయకులు ఆర్.రామలక్ష్మి, డి.పార్వతి, వి.ధనలక్ష్మి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఐసిడిఎస్‌కు తగిన నిధులు కేటాయించకపోవడంతో ఆకలితో అలమటించే వారి సంఖ్య పెరిగి మన దేశ స్థానం ప్రపంచంలో దిగజారిందన్నారు. సిఐటియు నాయకులు ఇరట నరసింహమూర్తి మద్దతు తెలియజేశారు. అంగన్వాడి హెల్పర్స్, వర్కర్స్ పాల్గొన్నారు.

కోటవురట్ల దీక్షా శిబిరాన్ని సిపిఎం నేత అప్పలరాజు సందర్శించి అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ సెంటర్లు తెరుచుకోకపోవడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

యస్.రాయవరం:మండల కేంద్రంలో అంగన్వాడీల సమ్మెకు జనసేన మద్దతు తెలిపింది. సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఖండించారు. అంగన్వాడీలకు న్యాయం జరిగే వరకు బాసటగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పప్పల శివ, ప్రసాదుల గణేష్ లోవరాజు,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో అంగన్వాడీల సమ్మె 18 రోజులకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి మంగ ప్రాజెక్టు అధ్యక్షురాలు భ్రమరాంబ పాల్గొన్నారు.


పెందుర్తిలో మాట్లాడుతున్న బండారు

కొనసాగిన అంగన్వాడీల నిరసనలు

మునగపాక : మునగపాకలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ధర్నా శిబిరాన్ని సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో రామలక్ష్మి, జయలక్ష్మి, హేమలత, సరస్వతి, అంజలి, ఉమా, భవాని, బొడ్డేడ లక్ష్మి, వెంకట సత్యవతి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం స్టానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆది వరలక్ష్మి, అమ్మాజీ, చిలుకమ్మా పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తల దీక్షలు కొనసాగాయి. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారి హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్వీ నాయుడు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 18వ రోజు నిరాహార దీక్షలు కొనసాగించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు సిహెచ్ దేవి, ఎం రమణి, పార్వతి, కే లక్ష్మి, సుజాత, జానకి, జగదీశ్వరి పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు పి.భవాని, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు ఆయాలు పాల్గొన్నారు.



కోటవురట్లలో మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

దేవరాపల్లి : మండల కేంద్రంలో అంగన్వాడీలు 18వ రోజు నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా శివలింగ పాటలతో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షకు సిపిఎం నాయకుడు డి.వెంకన్న మద్దతు పలికారు.

రాంబిల్లి : స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు చేస్తున్న రిలే నిరాహార దీక్ష 18వ రోజు కొనసాగింది. వీరికి మండలంలో పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి,దేముడు నాయుడు, అంగన్వాడీ నాయకులు మంగ, సుజాత, సావిత్రి, రమణమ్మ, సంతోషి పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు శుక్రవారం కొనసాగాయి. వీరి దీక్షా శిబిరాన్ని పలు కార్మిక సంఘాల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు.

సబ్బవరం : తమ సమస్యలను పరిష్కరించాలని 18 రోజులుగా సమ్మె, మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి ప్రారంభించారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గొంతిన అప్పారావు(చంటి), సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, తోపుడు బండ్ల సంఘం అధ్యక్షులు మొల్లేటి గౌరీశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు కె.కోటేశ్వరరావు, మిడ్ డే మీల్ వర్కర్స్ నాయకులు ఎస్.గౌరీ, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : అంగన్వాడీలు శుక్రవారం విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఇంటిని ముట్టడించారు. రెండు గంటల పాటు అక్కడే బైఠాయించారు. చివరకు అక్కడకు వచ్చిన ఎంపీ సత్యనారాయణకు వారంతా వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ అంగన్‌వాడీల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షులు తులసి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శోభారాణి, ఎఐటియుసి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.శ్యామలాదేవి, ఐఎఫ్‌టియు యూనియన్ నాయకురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పద్మనాభం తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలకు శుక్రవారంనాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. సాయంత్రం నాలుగు గంటల వరకు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.పద్మావతి మాట్లాడుతూ, ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు దీక్ష కొనసాగిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో లక్ష్మి, శ్రీదేవి, ధనలక్ష్మి, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తిలోని అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి సందర్శించి సంఘీభావం తెలిపారు. తమ ప్రభుత్వం వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆవగడ్డ అప్పలనాయుడు రెడ్డి నారాయణరావు, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బృందావతి, కార్యకర్తలు భవానీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాడుగులలో..


బుచ్చయ్యపేటలో..


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ విభూషణరావు సూచించారు. మండలంలోని జానకయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఫోక్సో చట్టం, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. పిల్లలు జీవించే హక్కును హరించిన వారికి ఈ ఫోక్సో చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. శారీరకంగా, మానసికంగా వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి ఈ చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుండే అలవర్చుకోవడంతో రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు.


జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న హరి

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి-నక్కపల్లి:నాణ్యమైన చదువు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి వసతి దీవెన నిధులు విడుదల చేయడంతో శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యాభివృద్ధిపై జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. చదువుతో ఎవ్వరూ అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో సీఎం జగన్ వసతి దీవెన ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని , ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లు నానాజీ, ఈశ్వరరావు, వేంపాడు పిఎసిఎస్ అధ్యక్షులు మణి రాజు, సర్పంచ్ లు సాదిరెడ్డి శ్రీనివాసరావు, సురేష్‌వర్మ, వైసిపి నాయకులు తాతారావు, గోవింద్ పాల్గొన్నారు.


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మార్కెట్ కమిటీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మాడుగుల: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాడుగుల నియోజకవర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎం.కోటపాడుకు చెందిన సేనాపతి కొండలరావు, వైస్ చైర్మన్ గా మాడుగుల కు చెందిన శ్రీనాధు శ్రీనివాసరావు (దేవరపల్లి శ్రీను), 17 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక నాయకుల సహకారంతో శాశ్వత వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, గిడ్డంగుల, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంకు ప్రభుత్వ స్థలాన్ని సేకరించి నిర్మాణం చేపట్టాలని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామధర్మజ మార్కెట్ కమిటీ కార్యాలయానికి త్వరలోనే స్థల పరిశీలన చేస్తామని హామీ ఇచ్చి నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ కే.విజయ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఊరేగిస్తున్న అర్చకులు

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న ఉత్సవ మూర్తులను పుణ్యకోటి వాహనం, గోదాదేవి అమ్మవారిని పల్లకీలోను అధిష్టింప చేసి గ్రామంలో తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు ,భక్తులు పాల్గొన్నారు

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రావికమతం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ధ్యేయంతో జెసిబి, ట్రాక్టర్ సహాయంతో చెత్తను తొలగించడం జరుగుతుందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని పలు వీధుల్లో రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడం జరుగుతుందన్నారు. తమ సొంత డబ్బులతోనే పారిశుధ్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం పంచాయతీకి నిధులు కేటాయించాలని కోరారు.

బస్ యాత్రకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:పట్టణంలో ఈ నెల 30న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమం ఏర్పాట్లను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్‌గణేష్ పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 40వేల మంది పార్టీ శ్రేణులు హాజరవుతారని, ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర పార్టీ ఇంచార్జి వైబి.సుబ్బారెడ్డి పలువురు నేతలు రానున్నారని తెలిపారు. నాయకులు పనుల్లో నిమగ్నయ్యారు.



నాయకులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

గొలుగొండ:ఈ నెల 30న నర్సీపట్నంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిరావాలని గొలుగొండ మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ నేతృత్వంలో ఈ యాత్ర జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, వైసిపి ముఖ్య నేతలు హాజరు కానున్నారన్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు జరిగే బహిరంగ సభకు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.



కొనుగోలును ప్రారంభిస్తున్న సర్పంచ్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్. నాగాపురం పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సంధ్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర అందిస్తుందని తెలిపారు. ఇటీవల తుపాన్‌తో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

ఉక్కు రక్షణకు గళమెత్తిన కళాకారులు

-ఉత్సాహం నింపిన ధూంధాం - ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం) వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం విశాఖలో కళాకారులు గళమెత్తారు. డ్యాన్సులతో అదరగొట్టారు. కళా ప్రదర్శనలతో జనంలో చైతన్యం నింపారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం గాజువాక లంకా గ్రౌండ్స్‌లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన తలపెట్టిన ధూం ధాం కార్యక్రమం శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. విశాఖ ఉక్కు రక్షణ.. తెలుగు ప్రజల ఊపిరి అన్నట్లుగా ప్రదర్శనలు సాగాయి. శ్రీకాకుళం నుండి వచ్చిన కళాకారుడు వర్మ 'విశాఖ ఉక్కురా.. తెలుగు ప్రజల హక్కురా.. కదం తొక్కురా' అన్నపాటతో



ఆకట్టుకున్నాడు. పల్సర్ బైకు ఝాన్సీ 'ఉక్కు సంకల్పం' సినిమాలోని గీతానికి చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది. అనంతరం ఆమె మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమానికి కళాకారుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ధూం ధాంకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ప్రజా, కార్మిక పోరాటాల వల్ల విశాఖ ఉక్కు కర్మాగారంలో ఒక్క శాతాన్ని కూడా కేంద్రం అమ్మలేకపోయిందన్నారు. ఉక్కు పరిరక్షణలో కళాకారుల పాత్ర మరువలేనిదని తెలిపారు. సుద్దాల అశోక్ తేజ, గోరేటి వెంకన్న, ఆర్.నారాయణమూర్తి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో కళారూపాల ద్వారా భాగస్వాములయ్యారన్నారు. కావాలనే విశాఖ ఉక్కును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నష్టాల్లోకి నెడుతోందన్నారు. విశాఖ ఉక్కు చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఉక్కు సత్యాగ్రహం సినిమా దర్శకుడు సత్యారెడ్డి మాట్లాడుతూ తన చిత్రం అందరిలో చైతన్యం రేకెత్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంవిఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎం.రమేష్ కుమార్, సిపిఎం 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరాం, డ్యాన్స్ మాస్టర్ రమేష్, డాక్టర్ సందీప్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, నాయకులు జి.రమణ, సిపిఎం స్టీల్ డివిజన్ నాయకులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు



కోలాటం ఆడుతున్న మహిళలు



నృత్యం చేస్తున్న కళాకారులు

డిప్యూటీ డిఇఒ అప్పారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -యస్.రాయవరం:మండల విద్యాశాఖాధి కారిగా పని చేసి ఇటీవల డిప్యూటీ డీఈవో గా పదోన్నతి పొందిన పెన్నాడ అప్పారావును ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మానం చేసినట్లు ప్రధానోపాధ్యాయులు యస్‌వి రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శుక్రవారం మాట్లాడుతూ, మండలంలో విద్యాశాఖలో పనిచేసి డిప్యూటీ డీఈవోగా పదోన్నతి పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మరెన్నో సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల జనరల్ సెక్రటరీ వి.శ్రీను, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేడు సామాజిక తనిఖీ బృందం పర్యటన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో (సోషల్ ఆడిట్)సామాజిక తనిఖీ బృందం ఈ నెల 30న పర్యేంచనుందని ఏపిఒ సూర్యమణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, మండలంలో 24 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం గ్రామాల వారీగా విభజించి తనిఖీ చేయనున్నారన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యాన బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం వాసవీ క్లబ్‌కు వాసవీ క్లబ్ డి 216ఎ డిస్ట్రిక్ గవర్నర్ పిఎస్.వరహాలబాబు రెండు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాసవీ క్లబ్ నర్సీపట్నం అధ్యక్షులు పెనుగొండ రమేష్ రెండు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని తుని రోడ్డు రామాలయం-1, ఆర్డీవో కార్యాలయం లోపల 3 ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జయరాం వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వరహాలరావు, డాక్టర్ సిఎస్.కుమార్, వెలగా నారాయణరావు, తబిసిలు అయ్యప్ప, వాసవీ క్లబ్ నర్సీపట్నం పిఎస్టీలు పెనుగొండ రమేష్ పాల్గొన్నారు.



. బెంచీలను ప్రారంభిస్తున్నఆర్డీవో జయరాం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పలువురికి రక్త పరీక్షలు

ప్రజాశక్తి-గొలుగొండ:రక్తహీనతతో పిల్లలు, గర్భిణీలు, బాలింత మరణాలు తగ్గించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పని చేయాలని జిల్లా ట్రాస్క్ ఫోర్సు డిపిఎంఒ డాక్టర్ లూసీ పేర్కొన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కేడిపేట సబ్ సెంటర్ పాఠశాల వద్ద రక్తహీనతతో ఉన్న గర్భిణీలు, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి రామచంద్ర, డిపిహెచ్‌ఎన్‌ఒ నాగమణి, డేటా మేనేజర్ జనార్ధన్, స్థానిక పిహెచ్‌సి వైద్యులు ఎన్.హరిప్రవీణ్, పిహెచ్ ఎన్ సావిత్రి, ఎంపిహెచ్‌ఒ బివి.సత్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో పాదయాత్ర

ప్రజాశక్తి-మాడుగుల: బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పొంగలిపాక గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. మండలంలోని పొంగలిపాక, కింతలి, వొమ్మలి, వొమ్మలి జగన్నాథపురం, గాదిరాయి, ఎం కృష్ణాపురం, జంపిన, చింతలూరు గ్రామాలలో రామానాయుడు పాదయాత్రను నిర్వహిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని మండల నేత దేవుడు అన్నారు.



పాదయాత్ర చేపడుతున్న రామానాయుడు